16

# కాగితపు పడవలు

హెడ్మాస్టర్ రాఘవయ్య బడి వరండాలో చూరుదగ్గర నిలబడి చూస్తూ ఉండిపోయాడు నిశ్శబ్దంగా.

వర్షం కురుస్తోంది జల్లుగా.

రెండు రోజుల నుండి ఒకటే ముసురు. ఎడతెరిపి లేకుండా ఒకటే చినుకులు. తడిచిన సబ్బులా నేలంతా మెత్తబడి నానిపోయింది. నగరమంతా... యిండ్లు, చెట్లు, రోడ్లు అన్నీ తడిచి తడిచి అలసి పోయాయి. ఎటుజూచినా బురద... చిత్తడి.. రొచ్చు....తేమ.

గుండెల్లో ముల్లు గుచ్చుకున్నట్టు మహా బాధగా ఉంది రాఘవయ్యకు.

"కాని.. తనేంజేయగలడు... తనేంచెయ్యగలడు-"

"ఏమీ చేయలేడు... ఏ...మీ చేయలేడు."

నిట్టూర్చాడు నిరాశగా...నిస్సహాయంగా. అప్పుడతను పంక్చరైన సైకిల్ ట్యూబ్‌లా ఉన్నాడు ఒంటినిండా విచారంతో.

"కాని యిలా ఎంతకాలం"

యీ ప్రశ్న నిన్నటినుండి అతన్ని వేధిస్తోంది, అరికాలిలో కలుకుమంటున్న ముల్లులా.

కాని జవాబు దొరకటం లేదు.

అసలు జవాబు ఉంటేగదా దొరకడానికి.

గాలి రివ్వున వీచింది కత్తిలా...చల్లగా.

చినుకులు అతని బట్టతలపై బడి, జల్లుమని ముడుచుకు పోయాడు.

ఎదురుగా పాఠశాల తాలూకు మూడు గదులు పశువుల కొట్టాలకన్నా హీనంగా సగం ఊడిపోయిన కప్పులతో నవ్వుతున్నాయి కుష్ఠురోగుల్లా. కప్పుపైనుండి రాలిన మట్టిపెళ్ళలు కిందపడి, కురుస్తున్న నీటిలో తడిచి బెంచీలు నల్లగా నానుతున్నాయి. ఒక్కో క్లాసులో గోడకు ఆనించి పెట్టిన బ్లాక్‌బోర్డ్ రంగు వెలిసి తడిచి వైట్‌బోర్డ్‌లైనాయి. మూడు క్లాసుల ముఖాలపైనా వరుసగా 8వ తరగతి, 9వ తరగతి, 10వ తరగతి అని

రాసిన బొగ్గు అక్షరాలు విద్యార్థుల నొసట రాక్షసులు రాసిన రాతల్లా ఉన్నాయి.

రాఘవయ్య తను నిలబడ్డ వరండా ప్రక్కకు తలపంకించి చూశాడు.-తన రంగు వెలసిపోయిన కళ్ళజోడును తీసి చేతిలోపట్టుకుని.

హెడ్మాస్టర్ గదికి అనుకుని ప్రక్కన స్టాఫ్‌రూం అనబడే ఓ చీకటి కొట్టం. అందులో ఏ ఒక్కదానికీ సరిగా అవయవాలు లేని పదిపన్నెండు కుర్చీలు. అందులో సున్నపు పెళ్ళలూడిపోతున్న గోడకు జిడ్డు వైర్లతో వ్రేలాడ గట్టిన ఫిలమెంటు రాలిపోయిన బల్బు. ఆ గదికవతల యింకో మూడు రేకుల షెడ్లు. ఏ ఒక్కదానికీ పూర్తిగా రేకులు లేవు. ప్రతి క్లాసునుండీ రేకుల రంధ్రాల గుండా ఆకాశం ముక్కలు కనబడుతాయి. అందులోనూ వర్షం కురిసి బెంచీలన్నీ తడుస్తున్నాయి.

యీ గదులన్నింటి కవతల ఓ మట్టిగోడ కాంపౌండ్‌లో ఓ వంద గజాల ఆట స్థలము కం ఆరుబయట క్లాసులకుపయోగ పడే మల్టీపర్పస్ ప్రదేశము. ఆ స్థలంలో రెండు దిక్కులా రెండు చింత చెట్లు. వాటి నడుమ ఎప్పటిదో చీకిపోయిన గాంధీ సిమెంట్ విగ్రహం.

గాంధీ వానలో తడుస్తున్నాడు మూడురోజుల నుండి ముసురులో.

అల్లా ఎన్ని ముసుర్లు, ఎన్ని ఎండా వానలు, ఎన్ని పక్షుల రెట్టలు పోయాయో గాంధీగారి పైనుండి.

రాఘవయ్యగారు నిలబడ్డ వరండా ముందరినుండి వాననీళ్ళు సన్నగా కాలువకట్టి నిశ్శబ్దంగా ప్రవహిస్తున్నాయి బయటికి - మురుగుకాలువలోకి.

ఆ మురుగుకాలువ దగ్గరే నిన్ననే గుంజ విరిగిపడిపోయిన పాఠశాల బోర్డ్. "ప్రభుత్వ ఉన్న.. పా..శాల..'' అక్షరాలు బోనులో నుండి ఎలుకల్లా ఆ పాఠశాలను చూచి బోర్డ్‌పైనుండి ఎగిరి పోయినట్టున్నాయి.

"యింతటి మహావైభవమైన ఉన్నత పాఠశాలకు తను ప్రధానోపాధ్యాయుడు"

"యింకా యీ వైభవంలో షిఫ్ట్ సిస్టమ్స్‌లో చదువులు"

"హు..."

ప్రక్కకు స్టాఫ్‌రూం దిక్కు నడిచాడు రాఘవయ్య.

లాంతరు వెలుగులో కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్న ఉపాధ్యాయులు చటుక్కున లేచి నిలబడ్డారు. ఆ మసక వెలుతురులో వాళ్ళందరూ పాలిపోయిన పాండురోగుల్లానో, శపించబడి చవటలుగా తయారుచేయబడ్డ అమాయకుల్లానో కనబడ్డారతనికి.

"యీ వాన యిప్పట్లో తగ్గేట్టు లేదు..." అని గొణిగాడు రాఘవయ్య స్వగతంలోలా.

"ఔన్సార్."

తలెత్తి చూశాడు రాఘవయ్య.

ఆ మాటన్నది సాంఘికశాస్త్రం చెప్పే దశరథరావు. దశరథరావు వెనుక గోడకు మాసిపోయిన భారతదేశ పటం వేలాడుతోంది.

"స్టూడెంట్స్‌ను యిలా ఎన్ని రోజులని ప్రతిదినమూ పంపిస్తాం యిళ్ళకు."

"మరి అంతకంటే ఏం జేయగలం సార్. కూర్చుంటానికి ఒక్క గజం నేలన్నా పొడిగా లేదు"

"కిరాయి కొంపలో ఉన్నందుకు యిల్లును బాగుచేయించాలన్న ధ్యాన యింటివానికి లేదు. మరి యిలా ఉంటే బడి ఎలా పనిచేస్తుంది అన్న యింగిత జ్ఞానం అధికారులకు లేదు. యిక పిల్లలకు చదువు రమ్మంటే ఎలా వస్తుంది."

"...." ఎవరూ మాట్లాడలేదు.

"యివన్నీ యిట్లుంటే మొన్న ఆ యిన్‌స్పెక్టరాఫ్ స్కూల్స్‌గాడు యిన్‌స్పెక్షన్ కొచ్చి - విద్యా ప్రమాణాలను యింకా పెంచాల్సి ఉంది. ప్రధానోపాధ్యాయుడు తగిన శ్రద్ధ తీసుకోనవలెను- అని రిపోర్ట్ రాసిపోయాడు. వెధవ..."

"......"

"వెనుకటి కెవడో అన్నాట్ట... పెళ్ళాన్ని చేసుకునే ఆచారముంది మాకు కాని కూడు పెట్టే ఆచారం లేదు- అని. అలా ఉంది వీళ్ళ సంగతి యీ బడి కూలిపోతోంది బాబో యిటు చూడండి అని డి.ఇ.వోకు ఎన్ని ఉత్తరాలు రాసినా, ఎన్నిసార్లు వ్యక్తిగతంగా మొరపెట్టుకున్నా వినిపించుకోరు. పట్టించుకోరు. కాని స్టాండర్డులు, ప్రమాణాలు అని కూతలు కూస్తారు కుక్కల్లా. ఏం బడండీ యిది మున్సిపాలిటీ చెత్తకుండీలా. యీ ప్రభుత్వం, యీ విద్యావిధానం పిల్లల జీవితాలను చేజేతులా నాశనం చేస్తోందిగదండీ ఓ బిచ్చపుదాన్ని పట్టుకుని నువ్వు అప్సరసలా అలంకరించుకుని రా పో అని దాని ఒళ్ళంతా చావబాదుతే ఏం జేస్తుందది పాపం. మన గతీ సరిగ్గా అలాగే ఉంది"

"యీ యింటిని కూడా ఖాళీ చేయమని ఓనరు నరసింహం మొత్తుకుంటున్నాడు గదండి. దాన్నే కాస్త సర్దించి బీడీ కంపెనీకి కిరాయి కిచ్చుకుంటే రెండు వందల యాభై వస్తుందట. వాని కిప్పుడు గవర్నమెంటిస్తున్నది డెబ్బయ్యయిదేనాయె. వాని ఏడుపులోనూ న్యాయముంది" అన్నాడు ఓ టీచర్.

"అందరి ఏడుపుల్లోనూ న్యాయం ఉంది. మన ఏడుపు అంతే. కాని యీ ఏడుపులను వినే నాథుడెవరు. యీ సిటీలో ఉన్న యిన్ని స్కూళ్ళలో ఏ ఒక్క దానికైనా స్వంత బిల్డింగుందా. అన్నీ కిరాయి కొంపలే. అందరిదీ యిదే గతి."

"యిప్పుడిక యీ కాస్త నాలుగ్గదులు కూడా ఉండేట్టులేదు సార్. ఓనర్ నరసింహ

మా యింటి ప్రక్కనే ఉంటాడుగదా. నిన్న అంటున్నాడు, బడిని ఖాళీచేయించడానికి కోర్టుకు అప్పీల్ చేస్తాడట..."

"అలాగా... " రాఘవయ్య గొణిగాడు.

"అన్నట్టు రామారావు అడ్వకేట్- మీ కుమారుడే గదా సార్"

"ఔను."

"ఆయన్ను సంప్రదించి కోర్టులో పెడతారట."

"అలాగా-"

బయట ప్యూన్ గంటకొట్టాడు విద్యార్థులు లేకున్నా. ఎవని డ్యూటీ వానిది.

రాఘవయ్య స్టాఫ్‌రూం నుండి బయటికొచ్చి గదులకు తాళాలువేయించి బయలుదేరాడు.

యింకా వర్షం పడుతూనే ఉంది.

గొడుగు విప్పుకున్నాడు రాఘవయ్య.

గేట్ దగ్గర యింటికి పోకుండా ఉండి పోయిన విద్యార్థులు వానలో తడుస్తూ మురుగుకాలవలో కాగితాల పడవలాట ఆడుకుంటున్నారు. రాఘవయ్యను చూచి ఎక్కడివాళ్ళక్కడ పరుగుతీశారు గాలికి కొట్టుకుపోతున్న కాగితపుముక్కల్లా.

★ ★ ★

యింట్లో... తన గదిలో కూర్చుని రామాయణంలోని కిష్కింధకాండ చదువుకుంటున్నాడు రాఘవయ్య.

ప్రక్కగదిలో తన కొడుకు రామారావు క్లయింట్స్‌కు సలహాలిస్తున్నాడు.

"...అదండీ సంగతి. ఎన్నిసార్లు చెప్పినా, అప్లికేషన్లు పెట్టుకున్నా ఆ బడిని ఖాళీచేయించడంలేదు ప్రభుత్వం. నేనిక కోర్టుకుపోవాలనుకుంటున్నాను." ఆ కంఠం తన పాఠశాల ఉన్న యింటి ఓనర్ నరసింహంది.

దీనికి కోర్టుకి పోవడమెందుకయా. నీక్కావలసింది నీ యింట్లో నుండి బడి వెళ్ళిపోవడం - అంతేకదా. ఆ పని నేను చేయించుతాను."

"బాబ్బాబు. ఆ పుణ్యం కట్టుకోండి"

" పాఠశాలలోని గదులెన్ని"

"మొత్తం ఎనిమిది"

"అందులో క్లాసులుండేటివెన్ని?"

"ఆరు"

"ఆ అరింటిలో బాగున్న గదులెన్ని?"

"ఓ మూడు,"

ఐతే ఓ పని చెయ్యి. యిప్పుడు ఎలాగూ ముసురు ఉంది ఓ వారం నుండి. రాత్రికి ఓ నలుగురు మనుషులను తీసుకుని ఆ మూడు గదుల గోడలను పడగొట్టించు. నిలవనీడలేక, క్లాసులను నడుపుకోలేక బడి దానంతటదే లేచిపోతుంది. తర్వాత మళ్ళీ కట్టుకోవచ్చు నెమ్మదిగా. దీంతో నీకయే ఖర్చుకూడా నువ్వు కోర్టుకుపోతే అయ్యే ఖర్చుకన్నా తక్కువే. ఊఁ..."

"అద్భుతం... అట్లాగే సేత్తానండీ రాత్రికి..."

....యింకా ఏదో మాట్లాడుకుంటున్నారు.

రాఘవయ్య మస్తిష్కంలో కిష్కిందకాండ తాలూకు కోతులు అరునన్నా ఎగురుగున్నాయి వికృతంగా.

ఈ దేశం నిండా కోతులే...

'యువ' మాసపత్రిక

ఆగస్టు 1982